క్లుప్తంగా

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

సీఐ బాలకృష్ణ

గురజాల : ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఫలితాల ప్రకటన అనంతరం ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ టి.బాలకృష్ణ హెచ్చరించారు. ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తరువాత సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు బాణసంచా పేలుళ్లు వంటి వాటికి అనుమతులు లేవన్నారు. ఎవరైనా రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసినా వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సహకరించాలన్నారు. ఎవరైనా ఉద్దేశ్యపూర్వకంగా, అవమానకరంగా నేరప్రేరేపిత విధంగా అసత్య ప్రచారాలు పంపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలన్నారు.

పల్లెలపై ప్రత్యేక నిఘా



పిడుగురాళ్లరూరల్: ఎన్నికలు పూర్తి అయి కౌంటింగ్ ప్రక్రియ రోజున గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తుగా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశానుసారం ప్రతి గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. అలజడులకు తావు లేకుండా పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేశారు. సమస్యాత్మక గ్రామాల్లో ఎలాంటి గొడవలు లేకుండా ప్రతి సన్నివేశాన్ని చిత్రీకరించేలా చాటర్ డ్రోన్‌లను ఉపయోగిస్తున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... కౌటింగ్ రోజున బయటకు వచ్చి ఎలాంటి అల్లర్లు సృష్టించిన, సంబరాలు నిర్వహించినా, డ్రోన్ వీడియోలో కనిపిస్తే జైలు పాలవుతారన్నారు. గ్రామాల్లో ప్రశాంతతకు భంగం కలిగించినా, పోలీసుల విధులకు ఆటంకం కలిగించినా కఠిన చర్యలు తప్పవని అన్నారు. అనంతరం కరాలపాడు గ్రామంలో చాటర్ డ్రోన్ ఉపయోగించి, దాని పనితీరును పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మాచర్ల రూరల్: ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీ కొట్టి ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కొత్తపల్లి జంక్షన్, ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు వద్ద సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే ఒంగోలు పట్టణానికి చెందిన నేలం శివ హైదరాబాద్‌లో బేల్దారి పనిచేస్తూ స్వగ్రామమైన ఒంగోలుకు ద్విచక్ర వాహనంపై వస్తున్న సమయంలో మార్గమధ్యంలోని పెట్రోల్ బంకు వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొన్నాడు. తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే చనిపోయాడు. ఈ మేరకు విజయపురిసౌత్ ఎస్‌ఐ పట్టాభి రామారావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మండలంలో 144 సెక్షన్ అమలు

ఎస్‌ఐ ఆంజనేయులు

రెంటచింతల: మే 13న జరిగిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మంగళవారం ఎన్నికల కౌంటింగ్ జరుగుతున్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాల మేరకు రెంటచింతల మండలంలోని వివిధ గ్రామాలలో 144 సెక్షన్ అమలులో ఉందని ఎస్‌ఐ ఎం.ఆంజనేయులు సోమవారం తెలిపారు. ఈ నెల 5వ తేదీ వరకు మండలంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ప్రధాన సెంటర్లలో ఇద్దరు, ముగ్గురు గుంపులు గుంపులుగా ఉండరాదని, ఎవరూ కూడా బాణసంచా కాల్చరాదని పేర్కొన్నారు. రాళ్లు, కర్రలు, ఆయుధాలతో సంచరించినట్లయితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి రౌడీ షీట్లు ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. మండల ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. సోషల్ మీడియా వేదికగా బెదిరింపులకు పాల్పడే వారిపై ఐటీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయడంతో పాటు రౌడీషీట్లు ఓపెన్ చేసి పీడీ యాక్ట్ ప్రయోగించడం వంటి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సోషల్ మీడియా పోస్టులపై పోలీస్ శాఖ నిరంతరం ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. దాడులు, అల్లర్లు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టామన్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ తరగతులు



క్రోసూరు: మండల కేంద్రంలోని గ్రంథాయలంలో వేసవి శిక్షణ తరగుతులు కొనసాగుతున్నాయి. ఈ నెల 7వ తేదీ వరకు జరిగే శిక్షణ తరగతుల ద్వారా విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జ్ఞానాన్ని పెంపొందించుకుంటున్నట్లు గ్రంథాయల అధికారి వై.వీరాంజమ్మ సోమవారం తెలిపారు. విద్యార్థులు ప్రతిరోజు పుస్తక పఠనం, కథలు చెప్పటం, క్యారమ్స్, చెస్ వంటి పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ముగింపు రోజున బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు.

కౌంటింగ్.. భద్రత కట్టుదిట్టం

- పోలీసుల అదుపులో గ్రామాలు
- అల్లర్లు జరగకుండా ప్రత్యేక చర్యలు
- సమస్యాత్మక గ్రామాల్లో డ్రోన్ కెమెరాలు ఏర్పాటు



పిడుగురాళ్ల పోలీస్ స్టేషన్

గురజాల/ పిడుగురాళ్ల : సార్వత్రిక ఎన్నికల సమయంలో గురజాల నియోజకవర్గంలోని గురజాల, దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల గ్రామాల్లో జరిగిన ఘర్షణల దృష్ట్యా పోలీసులు పటిష్ఠ భద్రత చర్యలు చేపట్టారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో కౌంటింగ్ ప్రశాంతంగా జరగడానికి ప్రత్యేక చర్యలు చేపట్టారు. 4వ తేదీ మంగళవారం కౌంటింగ్ జరిగే సమయంలో కేసుల్లో ఉన్న ఆయా రాజకీయ పార్టీల నేతలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఎన్నికల సమయంలో గొడవలు జరగడంతో ఆయా రాజకీయ పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు దాదాపు గురజాల నియోజకవర్గంలో 32 మందిపై రౌడీషీట్‌లు, 139 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు వారిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించనున్నారు.

రౌడీషీటర్ల కదలికలపై నిఘా

గురజాల నియోజకవర్గంలోని పలు మండలాల పరిధిలో 32 మందిపై రౌడీషీట్‌లు ఓపెన్ చేశారు. ఎన్నికల తరువాత గ్రామాల్లో జరిగిన గొడవలు, కొట్లాటల్లో యాక్టివ్‌గా పాల్గొన్న వారిపై పోలీసులు రౌడీషీట్ ఓపెన్ చేశారు. ఎన్నికల సమయంలో జరిగిన గొడవలు కౌంటింగ్ రోజు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా వారిపై నిఘా ఉంచారు.

డ్రోన్ కెమెరాలతో నిఘా

దాచేపల్లి, పిడుగురాళ్ల, మాచవరం మండలాల్లోని పలు గ్రామాల్లో ఎన్నికల రోజు, తరువాత గొడవలు జరిగాయి. మరలా అటువంటివి పునరావృతం కాకుండా ఆ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పోలీసులు తెలిపారు. పెద్ద పెద్ద డ్రోన్ కెమెరాలతో ఎప్పటికప్పుడు ఆ ప్రాంతాల్లో ఏం జరుగుతుంది అన్న విషయాలను తెలుసుకునే విధంగా చర్యలు చేపట్టారు. ప్రశాంతంగా కౌంటింగ్ పూర్తయ్యేలా అధికారులు చర్యలు చేపట్టారు.



గ్రామాల్లో డ్రోన్ కెమెరాలతో ట్రయల్ రన్ చేస్తున్న పోలీసులు

అల్లర్లు సృష్టిస్తే సహించేదిలేదు



కౌంటింగ్‌కు సంబంధించి ఎవరైనా గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే ఎంతటి వారినైనా సహించేది లేదు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా సహకరించండి.. గ్రామాల్లో అల్లర్లు సృష్టించి ఇబ్బందులకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో సైతం 144 సెక్షన్ అమలులో ఉంది. ఎవరూ కూడా బయటకు రావద్దు. బయటకు వచ్చి ఇబ్బందులను కొనితెచ్చుకోవద్దు.

– సీహెచ్ శ్రీనివాసరావు, డీఎస్పీ గురజాల

నేడే కౌంటింగ్

- మాచర్ల నియోజకవర్గంలో 22 రౌండ్లలో ఫలితం
- 299 పోలింగ్‌బూత్‌లు.. 22 రౌండ్లు
- అత్యధికంగా 3వ రౌండ్‌లో లెక్కింపు
- అత్యల్పంగా 22వ రౌండ్‌లో లెక్కింపు



మాచర్ల రూరల్: మే 13న జరిగిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మాచర్ల నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ జరగని విధంగా ఓటర్లు పెద్ద ఎత్తున ఓటింగ్‌లో పాల్గొన్నారు. నియోజకవర్గంలో మొత్తం 299 పోలింగ్ బూత్‌లున్నాయి. మాచర్ల పట్టణం, మాచర్ల మండలం, వెల్దుర్తి, దుర్గి, కారంపూడి, రెంటచింతల మండలాల్లో అత్యధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలోని పోలింగ్ బూత్‌లకు గాను 22 రౌండ్లలో లెక్కింపు జరుగుతుంది. ఒక్కొక్క రౌండ్‌లో 14 బూత్‌లు కలిపి ఒక రౌండ్‌గా లెక్కింపు చేస్తారు. హోం ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుకు ప్రత్యేక టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాం ప్రసాద్ లెక్కల ప్రకారం నియోజకవర్గంలో పురుషులు 1,28,639, స్త్రీలు 1,33,743 మంది, 22 మంది ట్రాన్స్‌జెండర్స్ ఉన్నారు. నియోజకవర్గంలో 2,62,404 మంది ఓటర్లున్నారు. ఇందులో 1,08,328 మంది పురుషులు, 1,11,428 మంది మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 83.75 శాతం పోలింగ్ నమోదైంది. 3 వేల మంది మహిళలు అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. సుమారు 40 వేల మంది ఓటు హక్కు వినియోగించుకోలేదు. మహిళలు ఓటు హక్కు వినియోగించుకోవటంలో మంచి ఉత్సాహాన్ని కనబర్చారు. ఉదయం నుంచే బారులు తీరి రాత్రి 9 గంటలు దాటినా ఓటు హక్కు వినియోగించుకున్నారు. మహిళలు ఏ పార్టీకి మొగ్గితే ఆ పార్టీయే గెలిచేలా ఉందని ప్రజలు భావిస్తున్నారు. ప్రస్తుతం మాచర్ల నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారాని ఉత్కంఠ నెలకొంది. నేడు జరగనున్న కౌంటింగ్‌లో విజేతలెవరో మరికొన్ని గంటల్లో తేలనుంది.

మాచర్ల: రాష్ట్రంలో మే 13న జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు మాచర్ల నియోజకవర్గంలో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డిలు తమ విజయం కోసం సాయశక్తులా ప్రయత్నించారు. పోల్ మేనేజ్‌మెంట్‌లో ఇరుపార్టీలు పోటీ పడి ఓటింగ్ జరగటం వల్ల మొత్తం 83.75 శాతం ఓట్లు పోలయ్యాయి. మొత్తం మాచర్ల నియోజకవర్గంలో మాచర్ల పట్టణం, రూరల్, వెల్దుర్తి, కారంపూడి, రెంటచింతల, దుర్గి మండలాల్లో 2,62,404 మంది ఓటర్లు ఉండగా 299 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. మొత్తం 2,19,766 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. గతం కన్నా 2 శాతం ఓటింగ్ పెరిగింది. 2 వేల మందికి పైగా పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించారు. పోలైన ఓట్ల మొత్తాన్ని మంగళవారం ఉదయం నుంచి నరసరావుపేటలో 22 రౌండ్లలో లెక్కించనున్నారు. ఒక్కొక్క రౌండ్‌కు 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు.

గెలుపెవరిది

వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన పీఆర్కే వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేయగా ఇప్పటికే నియోజకవర్గంలో రెండుసార్లు పిన్నెల్లి కుటుంబంపై ఓడిపోయిన బ్రహ్మారెడ్డి మూడవ విడత తన వంతు ప్రయత్నం చేశారు. చేసిన అభివృద్ధి, వివిధ కార్యక్రమాలు, ప్రజలకు అందుబాటులో ఉండే విషయం. గడప గడపతో పాటు అనేక కార్యక్రమాలను నిరంతరం కొనసాగించిన పీఆర్కే మరోసారి ధీమాగా ఉన్నారు. అందుకు భిన్నంగా నియోజకవర్గానికి దూరంగా ఉన్న బ్రహ్మారెడ్డి గొడవలే ధ్యేయంగా నియోజకవర్గంలో ప్రవేశించినప్పటి నుంచి ఆయా గ్రామాలలో రెచ్చగొట్టే ప్రయత్నం చేసి ప్రజల వ్యతిరేకతతో పాటు ఒక సామాజిక వర్గం తనకు పూర్తిగా మద్దతు పలికితే విజయం సాధిస్తానని ఆ దిశగా తన వంతు ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో ఎన్నికలు జరిగిన రోజు నుంచి పలు చోట్ల ఘర్షణలు జరిగాయి. ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మాచర్ల నియోజకవర్గాన్ని పోలీసులు తమ గుప్పిట్లోకి తీసుకొని ఫలితాల లెక్కింపు అనంతరం ఎటువంటి వివాదాలు జరగకుండా చర్యలు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ వర్గాలు పూర్తిగా విజయం పై ధీమా వ్యక్తం చేస్తుండగా ఏదో విధంగా తాము విజయం సాధిస్తామని టీడీపీ వర్గాలు భావిస్తున్నాయి. మొత్తంమీద మంగళవారం మధ్యాహ్నానికి ఉత్కంఠ తొలగనుంది.

నియోజకవర్గంలో లెక్కింపు ఇలా...

రౌండ్	లెక్కించే ఓట్లు
1	8,020
2	11,623
3	11,921
4	10,789
5	11,871
6	11,250
7	9,818
8	9,567
9	9,962
10	10,294
11	11,135
12	10,079
13	10,708
14	10,003
15	9,421
16	9,142
17	8,353
18.	10,658
19.	10,784
20	11,585
21	9,416
22	2,867

మాచర్లలో పోలీసుల భారీ బందోబస్తు



వజ్ర వాహనం



మాచర్ల పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

నేడు వెలువడనున్న ఎన్నికల ఫలితాలు

మాచర్ల: ఘర్షణలు, హింసాత్మక ఘటనల నడుమ మాచర్ల నియోజకవర్గంలో మే 13న జరిగిన ఎన్నికలలో ఓటర్లు అధిక శాతం ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సారి మాచర్ల నియోజకవర్గంలో 83.75 శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికల రోజు నుంచి ఇప్పటి వరకు కర్ఫ్యూ వాతావరణం నెలకొని 144 సెక్షన్, పోలీసు యాక్టు 30 అమలులో ఉంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ర్యాపిడ్ ఫోర్స్, సివిల్ పోలీసు, ఎస్‌పీఎఫ్ పోలీసులు వందల మంది మాచర్ల పట్టణంలో బందోబస్తు నిర్వహిస్తూ ఎటువంటి అలజడులు జరగకుండా చర్యలు తీసుకున్నారు. గొడవలు జరిగినప్పటి నుంచి పోలీసులు ఎక్కడికక్కడ షాపులు మూయించారు. ఈ నెల 5వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎవరూ ఇళ్లలో నుంచి అత్యవసర పరిస్థితులలో తప్ప బయటకు రావద్దని, అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అందులో భాగంగా వజ్ర వాహనాన్ని, అదనపు బలగాలను రంగంలోకి దించి బందోబస్తు నిర్వహిస్తున్నారు. అలాగే సోమవారం మాచర్ల పట్టణంలో కవాతు నిర్వహించారు. ఎస్పీ మలికా గార్గ్ ఆధ్వర్యంలో డీఎస్పీ, సీఐలు, ఎస్‌ఐలు బందోబస్తు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని వెల్దుర్తి, కారంపూడి, మాచర్ల పట్టణం, రూరల్, రెంటచింతల, దుర్గిలో బందోబస్తు చర్యలు చేపట్టారు.

శాంతించిన భానుడు.. పలకరించిన వరుణుడు

గురజాల : నైరుతి రుతుపవనాల ప్రభావంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఆదివారం మధ్యాహ్నం కూడా భానుడు తన ప్రతాపాన్ని చూపాడు. నెత్తిన నిప్పుల కుంపటి వలె వుంది. ఆదివారం రాత్రి వరుణుడు పలకరించడంతో వాతావరణం మారిపోయింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు చిరుజల్లులు పడ్డాయి. రుతు పవనాల ప్రభావంతో మేఘాలు చురుగ్గా కదలడంతో మండలంలో మరింతగా వర్షాలు పడే సూచనలు కనిపిస్తున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోతలతో కొద్ది రోజులుగా ఇబ్బందులు పడిన జనం ఇప్పుడు వాతావరణం చల్లబడటంతో ఊపిరి పీల్చుకున్నారు. మరో పక్క ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని గొర్రెల కాపరి మృతి

క్రోసూరు: గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో రోడ్డు మార్జిన్‌లో నిద్రిస్తున్న గొర్రెల కాపరి మృతి చెందిన ఘటన సోమవారం వేకువ జామున చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఎం.షఫీ తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా, దేవరకద్ర మండలం ,గద్దెగూడెంకు చెందిన సర్దా తిరుమలయ్య(42), మరికొందరితో కలిసి మండలంలోని బాలెమర్రు గ్రామం ఊంటూ జీవాలతో వచ్చి చుట్టు పక్కల గ్రామాల్లోని రైతుల పంట పొలాల్లో గొర్రెల ఎరువులు పెడుతున్నారు. రాత్రి వర్షం కురవటంతో గ్రామంలోని తారు రోడ్డు పక్కగా నల్లపట్టా కప్పుకుని నిద్రించాడు. ఈ క్రమంలో వేకువజామున గుర్తుతెలియని వాహనం అతి వేగంగా వస్తూ నిద్రపోతున్న తిరుమలయ్యను ఢీకొట్టి వెళ్లింది. దీంతో తీవ్ర గాయాలతో తిరుమలయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు నరేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం పూర్తి చేయించి కుమారుడికి అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.



సర్దా తిరుమలయ్య మృతదేహం

200 మంది పోలీసులతో భారీ బందోబస్తు

రూరల్ సీఐ సురేష్



వెల్దుర్తి: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాలలో శాంతిభద్రతలు కాపాడేందుకు 200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు మాచర్ల రూరల్ సీఐ సురేష్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని సమస్యాత్మకమైన గ్రామాలలో ఎక్కువ మంది పోలీసులను బందోబస్తుకు నియమించామన్నారు. మండలంలోని 20 పంచాయతీల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ అనంతరం గ్రామాలలో సభలు, సమావేశాలతో పాటు బాణసంచా, ర్యాలీలు, డప్పు వాయిద్యాలు వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు గ్రామాల్లో గుంపులు గుంపులుగా ఉండకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. ఏ పార్టీ గెలిచినా సోదరభావంతో కలిసి మెలిసి ఉండాలన్నారు. గొడవల వలన ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. రాజకీయ పార్టీల నాయకులు సహకరించి గ్రామాలలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలన్నారు.

ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలి

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- నియోజకవర్గంలోని కౌంటింగ్ ఏజంట్లతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: ఈవీఎంలను స్ట్రాంగ్ రూం నుంచి కౌంటింగ్ కేంద్రంలోకి తెచ్చేప్పటి నుంచి .. లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు ఏజెంట్లు పూర్తి స్థాయి అప్రమత్తతతో ఉండాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సూచించారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం కౌంటింగ్ ఏజెంట్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ మంగళవారం ఉదయం 6 గంటలకే ఎన్నికల కేంద్రంలోకి లెక్కింపు ఏజెంట్లు గుర్తింపు కార్డు, 17–సీ ఫారాలు తీసుకుని వెళ్లాలన్నారు. స్ట్రాంగ్ రూం నుంచి ఈవీఎంలు తీసుకొచ్చే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో కూటమి కుయుక్తులు పన్నే అవకాశం ఉందని, జాగ్రత్తగా ఉండాలన్నారు. వైఎస్సార్ సీపీకి పడిన ఒక్క ఓటు కూడా వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్‌లో లోపాలు గమనిస్తే వెంటనే ఆర్వో, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని వివరించారు. సర్వేలన్నీ వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉన్నాయని, రాష్ట్రంలోనూ, నియోజవర్గంలోనూ గెలుస్తున్నామని స్పష్టం చేశారు. ముందుగా బ్యాలెట్ ఓట్లు, ఈవీఎం బాక్సుల్లో ఓట్ల లెక్కింపు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైఎస్సార్ సీపీ చీఫ్ ఏజెంట్ ఉపేష్ అవగాహన కల్పించారు. సమావేశంలో గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెంబాబురావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగుర్‌మీరాన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, మండల పార్టీ అధ్యక్షుడు పురుషోత్తమరావు, కళ్ళం విజయభాస్కరరెడ్డి, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల పార్టీ కన్వీనర్లు ఉన్నారు.

ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పనులు కల్పించాలి

ఎంపీడీవో పి.శంకర్‌రావు



ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పంట కాల్వ అభివృద్ధి పనులు

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం జాబ్‌కార్డు కలిగి పని అడిగిన ప్రతి ఒక్కరికి పనులు కల్పించాలని ఎంపీడీవో పెదప్రోలు శంకర్ రావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని మండలంలోని పాలువాయిగేటు, మల్లవరం, రెంటాల, పాలువాయి గ్రామాలలో ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పంట కాల్వల అభివృద్ధి పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. 2024–25 సంవత్సరంలో గుర్తించిన పనులను ప్రభుత్వ నిబంధనల మేరకు సకాలంలో పూర్తి చేయాలన్నారు. మండల పరిధిలోని గ్రామాలలో 2024–25కు సంబంధించి ఉపాధిహామీ పథకం కింద రూ.8.50 కోట్ల విలువైన 219 పనులకు ప్రభుత్వం నుంచి ఇప్పటికే అనుమతి లభించిందన్నారు. మరో రూ.7.50 కోట్ల విలువైన 254 పనులను కూడా గుర్తించి ప్రభుత్వ అనుమతుల కోసం పంపించడం జరిగిందన్నారు. గ్రామాలలో ప్రస్తుతం పంటకాల్వలు, మేజర్ కాల్వల్లో పూడిక తీయుట, రైతుల పంట పొలాల్లో నీటి కుంటలు తీయుట, పండ్ల తోటల పెంపకానికి సంబంధించి గుంటలు తీయుట వంటి పనులను చేపడుతున్నట్లు తెలిపారు. 11 గ్రామాలకు సంబంధించి ఇప్పటి వరకు 10,750 మందికి ఉపాధి హామీ పథకం కింద జాబ్‌కార్డులు అందజేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం మండలంలో మొత్తం 2,356 మంది ఉపాధి పనులకు వస్తున్నారన్నారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.300 వేతనం ఇస్తున్నట్లు తెలిపారు. అవసరమైతే మరికొన్ని పనులను చేపట్టేందుకు గ్రామాలలో ఎఫ్‌ఏలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆయన వెంట ఏపీవో జి.జయచంద్రకుమార్, ఎఫ్‌ఏలు రామాంజి, సామ్యానాయక్, మణి, ప్రసాద్ తదితరులున్నారు.

జగన్ మళ్లీ సీఎం కావాలని పూజలు



రెంటచింతల: మే 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుతూ తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా చింతపల్లి సాయిబాబా మందిరంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్యామల రవి కిశోర్‌రెడ్డి సోమవారం కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిబాబా చల్లని ఆశీస్సులు సీఎం జగన్‌పై, పార్టీ అభ్యర్థులపై ఉండాలని ప్రత్యేక పూజలు జరిపించినట్లు రవి కిశోర్‌రెడ్డి తెలిపారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో 151 ఎమ్మెల్యేలు, 22 మంది ఎంపీలను గెలిపించి భారీ విజయాన్ని అందించిన రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను 100 శాతం అమలు చేసి వారి జీవితాలలో నూతన వెలుగులు నింపారన్నారు. నేను మీ కుటుంబానికి మేలు చేశాను అని నమ్మితేనే ఓటు వేయాలని అడిగిన ముఖ్యమంత్రి దేశ చరిత్రలో ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. ఎన్ని ఇబ్బందులు, విపత్తులు వచ్చినా ప్రజలు శ్రేయస్సే లక్ష్యంగా ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే సీఎం జగనన్నకు శ్రీరామ రక్ష అన్నారు. ప్రతి పక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా మంచి చేసేవారికే అంతిమ విజయం దక్కుతుందన్నారు.

పోలీసు పహారాలో పల్లెలు

- కౌంటింగ్ నేపథ్యంలో 144 సెక్షన్, 30 యాక్టు అమలు
- పట్టణం, గ్రామాలలో కేంద్ర బలగాలతో బందోబస్తు



కంభంపాడు గ్రామంలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

మాచర్ల రూరల్: సార్వత్రిక ఎన్నికల తరువాత పట్టణ, గ్రామాలలో ఎటువంటి ఘర్షణలు, అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణ, గ్రామాలలో 30 పోలీసు యాక్టు అమలులో ఉండగా రెండు రోజుల నుంచి 144 సెక్షన్ అమలులోకి తీసుకొచ్చి పోలీసు పాయింట్లు, పికెట్లు ఏర్పాటు చేశారు. పట్టణంలోని ప్రధాన వీధులు, గ్రామాలలోని కంభంపాడు, రాయవరం, జమ్మలమడక, పాలవాయి గేటు, రెంటచింతల, కారంపూడి ప్రాంతాలలో 13 మొబైల్ పార్టీలు, 52 పోలీసు పాయింట్లు, 18 పోలీసు పికెట్లు ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇప్పటికే రౌడీషటర్లు, ట్రబుల్ షూటర్లను అదుపులోకి తీసుకుని వారికి ఎన్నికల ముందు నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. ముఖ్యమైన ప్రాంతాలలో పోలీసులు, అధికారులు, సిబ్బంది, కేంద్ర బలగాలతో మాక్ డ్రిల్, మార్చ్‌ఫాస్టులు నిర్వహించారు. అల్లరిమూకలు అలజడులు సృష్టిస్తే వెంటనే అదుపులోకి తీసుకొని కఠిన చర్యలు తీసుకునేలా అధికారులు ఆదేశించారు. ఫలితాల తరువాత ఎటువంటి ర్యాలీలు, బాణసంచా కాల్చకుండా పూర్తిగా నిషేధించామన్నారు. గ్రామాలలో ఎక్కడ చూసినా నిశ్శబ్ద వాతావరణం నెలకొని ఉంది.

రేపు పర్యావరణంపై చిత్రలేఖనం పోటీలు

నరసరావుపేట ఈస్ట్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 5వతేదిన శ్రీనాథ సాహితీ పరిషత్, ఆంధ్ర చైతన్య గ్రూప్ సంయుక్త ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్టు పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి సోమవారం తెలిపారు. పల్నాడురోడ్డులోని శాఖా గ్రంథాలయంలో 5వ తేదీ ఉదయం 10 గంటలకు పోటీ ప్రారంభమవుతుందని వివరించారు. పోటీలో పాల్గొనేందుకు 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. పర్యావరణాన్ని ప్రతిబింబించేలా పర్యావరణ పరిరక్షణ, వాతావరణ కాలుష్యం, మొక్కల పెంపకం, వాహనాల రద్దీ అంశాలలో ఏదో ఒక అంశంపై విద్యార్థులు చిత్రం గీయవచ్చన్నారు. డ్రాయింగ్‌కు సంబంధించిన సామాగ్రిని విద్యార్థులే సమకూర్చుకోవాలన్నారు.